

అసిస్టెంట్ కమిషనర్‌గా అప్పలరాజు బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



విజయనగరం నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ గా కె.అప్పలరాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్యను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాన్ని ఇచ్చి అభినందించారు. అనంతరం అప్పలరాజు మాట్లాడుతూ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో, తోటి సిబ్బంది సమన్వయంతో నగరాభివృద్ధికి తనవంతు కషి చేస్తానని అన్నారు. ముఖ్యంగా ఆదాయ రాబడిపై దృష్టి సారిస్తానని, పన్ను వసూళ్ల లక్ష్యాలను అధిగమించేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో అడ్డదారులు



మొసానిక్ టెంపుల్‌లో విందు ఆరగిస్తున్న ఉపాధ్యాయులు(ఫైల్)

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఎపిటిఎఫ్, పిఆర్‌టియు బలపర్చిన అభ్యర్థుల ప్రచారం అడ్డదారులు తొక్కుతోంది. డైరీలు, ఇతర కానుకల పంపిణీతో ప్రలోభాలు ఇప్పటికే మొదలవ్వగా, తాజాగా విందు భోజనాలతో ప్రలోభాలకు గురి చేస్తున్నారు. అటు యుటిఎఫ్ అభ్యర్థి కె.విజయగౌరి మద్దతుదారులు మాత్రం ఓటర్లను కలిసి ఆమె ఉద్యమ ప్రస్థానం, పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ఉద్యోగులు, ఉపాధ్యాయ సమస్యలు, విద్యారంగ పరిరక్షణకు ఇప్పటి వరకు చేసిన పోరాటాలు, కృషిని వివరిస్తున్నారు. ఈ ఎన్నికల్లో ప్రధానంగా పిడిఎఫ్ అభ్యర్థి కె.విజయగౌరి, ఎపిటిఎఫ్ మద్దతుదారు పి.రఘువర్మ, పిఆర్‌టియు మద్దతుదారు గాదె శ్రీనివాసుల నాయుడు మధ్యే పోటీ నెలకున్నప్పటికీ విజయగౌరి దారి వేరు, మిగిలిన ఇద్దరు అభ్యర్థులు అనుసరిస్తున్న దారి వేరనే విమర్శలు వినిపిస్తున్నాయి.

- విద్యా సదస్సు పేరిట కూటమి అభ్యర్థుల విందు భోజనాలు
- డైరీలు, ఇతర కానుకలు ఎర
- ఓటమి భయమే కారణమా?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఈనెల 27న జరుగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 10మంది ఉన్నప్పటికీ యుటిఎఫ్‌తో పాటు పలు ఉపాధ్యాయ సంఘాలు బలపర్చిన పిడిఎఫ్ అభ్యర్థి కె.విజయగౌరి, ఎపిటిఎఫ్ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ, ఎపిటిఎఫ్ అభ్యర్థి గాదె శ్రీనివాసుల నాయుడు మధ్య ప్రధాన పోటీ కనిపిస్తోంది. గతంలో శ్రీనివాసులను నాయుడు వరుసగా రెండు సార్లు గెలిచినప్పటికీ అధికారంలో ఏ పార్టీ ఉంటే ఆ పార్టీకి అనుగుణంగా వ్యవహరించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలపై ఒత్తిడి చేయలేదు. గత సారి ఎపిటిఎఫ్ మద్దతుదారు రఘువర్మ ఎమ్మెల్సీగా గెలిచినప్పటికీ శాసన మండలిలో ఉపాధ్యాయుల తరపున గొంతు వినిపించలేక పోయారు. వైసిపి ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయులు పెద్దఎత్తున ఉద్యమించిన సందర్భంలో రఘువర్మ ముఖం చాటేశారన్న విమర్శలు ఉన్నాయి. దీంతో, ఈ ఇద్దరిపైనా ఉపాధ్యాయుల్లో వ్యతిరేకత వ్యక్తమౌతోంది. ఈనేపథ్యంలో ప్రలోభాలతో మరోసారి ఎన్నికల్లో నెగ్గేందుకు పోటీ పడుతున్నారని ఉపాధ్యాయులనుంచి విమర్శలు వస్తున్నాయి. ఇందులో భాగంగానే ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే శ్రీనివాసులు నాయుడు విందు భోజనాలతో శిబిరాలు నడిపిన సంగతి తెలిసిందే.

తాజాగా రఘువర్మ మద్ధతు దారులు విజయ నగరం నడిబొడ్డునగల మెసానిక్ టెంపుల్‌లో నిర్వాహకుల పేరూ ఊరూ లేకుండా మంగళవారం నాడు 'విద్యారంగం- వర్తమాన సవాళ్లు' సదస్సు పేరిట ఎన్నికల ప్రచార సభ నిర్వహించారు. ఈ సందర్భంగా విందు భోజనం ఏర్పాటు చేసి వర్మకు మద్ధతు కూడగట్టేందుకు ప్రయత్నించారు. మరోవైపు ఉపాధ్యాయుల మద్ధతు ఉన్నట్టుగా చెప్పుకునేందుకు ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేసినవారిని రోజువారీ కూలి ఇచ్చిమరీ ప్రచారం చేసుకుంటున్నారని ఉపాధ్యాయుల్లో చర్చ నడుస్తోంది. పిఆర్‌టియు అభ్యర్థి గాదె శ్రీనివాసులనాయుడు కూడా ఉపాధ్యాయులను ప్రలోభాలకు గురిచేసేందుకు సిద్ధమవుతున్నారు.

విజయగౌరి మద్ధతు దారులు ఇందుకు భిన్నంగా ప్రచారం చేస్తున్నారు. ఓటర్లను నేరుగా కలవడంతోపాటు యుటిఎఫ్ నేతగా విజయగౌరి ఉపాధ్యాయ సమస్యలు, విద్యారంగ పరిరక్షణకు చేసిన ఉద్యమాలను వివరిస్తున్నారు. దీనికితోడు ఆమె కుటుంబ సభ్యుల ఉద్యమ ప్రస్థానం కూడా గుర్తు చేస్తుండడంతో ఉపాధ్యాయుల్లో సానుకూల స్పందన లభిస్తోంది. దీనికితోడు శాసనమండలిలో పిడిఎఫ్ మాజీ ఫ్లోర్ లీడర్ వి.బాలసుబ్రహ్మణ్యం, ప్రస్తుత ఎమెల్సీ ఐ.వెంకటేశ్వరరావు, గతంలో రెండుసార్లు ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిచి, ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, గెస్ట్ లెక్చరర్ల సమస్యల పరిష్కారానికి, ప్రైవేటు స్కూళ్ల పరిరక్షణకు విశేషంగా కృషిచేసిన ఎంవిఎస్ శర్మ కూడా విజయగౌరికి మద్దతుగా ప్రచారం చేస్తున్నారు. యుటిఎఫ్, ఫ్యాప్టో రాష్ట్ర నాయకులు సైతం విజయగౌరికి మద్దతుగా ప్రచారం చేస్తున్నారు.

అవకాశమిస్తే మీ గళమవుతా

ఏజెన్సీలో పిడిఎఫ్ అభ్యర్థి విజయగౌరి విస్తృత ప్రచారం

ప్రజాశక్తి-సీతంపేట

ఎమ్మెల్సీగా తనను గెలిపిస్తే శాసనమండలిలో ఉపాధ్యాయుల గళం వినిపించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట ఏజెన్సీలో బుధవారం నాయుడుమల్లి, సీతంపేట, శంభాం, ముత్యాలు గ్రామాల్లోని పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 33ఏళ్లుగా నిజాయితీ, నిబద్ధతతో ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణ, సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించడం, 12వ పిఆర్‌సి చైర్మన్‌ను నియమించడం, ఆర్థిక బకాయిలు చెల్లింపు, కాంట్రాక్టు ఉపాధ్యాయులు, అధ్యాపకులను రెగ్యులర్ చేయడం, తదితర డిమాండ్ల పరిష్కారానికి కృషి చేస్తానని వెల్లడించారు. డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో జిఒ 114 అమలుకు పని చేస్తానన్నారు. కెజిబివి ఉపాధ్యాయులకు మినిమం టైం స్కేల్ అమలు చేయడానికి, రెగ్యులర్ చేయడానికి తనవంతు ప్రయత్నిస్తానని తెలిపారు. జిఒ 3 పునరుద్ధరణకు కృషి చేస్తానని తెలిపారు. ఉపాధ్యాయుల గొంతును శాసనమండలిలో వినిపించేందుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ రాజకుమారి, జిల్లా మహిళా కార్యదర్శి విశాలాక్షి, మహిళా నాయకులు చంద్రకళ, జిల్లా గౌరవ అధ్యక్షులు ఆరిక భాస్కరరావు, కార్యదర్శి కె.కృష్ణారావు, కౌన్సిలర్లు బి.జయప్రకాశ్, పి.కృష్ణారావు, మండల అధ్యక్ష, కార్యదర్శులు కె.ఆనందరావు, గణేష్, ట్రెజరర్ సింహాచలం, నాయకులు శ్రీనివాసరావు, బి.పకీరు, పద్మశ్రీ, పి.నారాయుడు తదితరులు పాల్గొన్నారు.



సీతంపేట బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయినులతో కలిసి విక్టరీ చిహ్నం చూపిస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి విజయగౌరి

విజయగౌరి ఇంటింటి ప్రచారం

పాలకొండ : పాలకొండ పట్టణంలోని నవోదయ నగర్, శ్రీనివాస్ నగర్, టీచర్స్ కాలనీ, ఎన్‌కె రాజపురం, గాయత్రి నగర్ ప్రాంతాల్లో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రశ్నించే గొంతుక అవుతానని, తనను గెలిపించే బాధ్యత మీరందరూ తీసుకోవాలని కోరారు. ప్రచారంలో జన విజ్ఞాన వేదిక ప్రతినిధి మహేష్, యుటిఎఫ్ జిల్లా నాయకులు మజ్జి పైడిరాజు, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

భామిని : బాలేరు, భామిని, కొత్తూరులో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.విజయగౌరి ప్రచారం చేపట్టారు. ఉపాధ్యాయ, అధ్యాపకులతో మాట్లాడారు. తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే, కాంట్రాక్టు లెక్చరర్లు, కెజిబివి ఉపాధ్యాయుల ఉద్యోగ భద్రత, మినిమం టైం స్కేల్ సాధనకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆరికి భాస్కరరావు, రాష్ట్ర కౌన్సిలర్ దండు ప్రకాశ్‌రావు, జిల్లా కార్యదర్శి కుండంగి కృష్ణారావు, భామిని మండల అధ్యక్షులు ఈగల తిరుపతిరావు, జిల్లా కౌన్సిలర్లు పి.కృష్ణారావు, మహిళా నాయకులు టి.రాజకుమారి, విశాలాక్షి, సిఐటియు నాయకులు సిర్ల ప్రసాద్ పాల్గొన్నారు.

విజయగౌరి గెలుపు ఉపాధ్యాయులకు కీలకం

ఫ్యాప్టో పూర్వ చైర్మన్ బాబురెడ్డి

ప్రజాశక్తి-రాజాం

రాష్ట్రంలో విద్యారంగంలో జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణ కోసం పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.విజయగౌరిని గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతయినా ఉందని ఫ్యాప్టో పూర్వ చైర్మన్, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు పి.బాబురెడ్డి అన్నారు. విజయగౌరిని గెలిపించాలని కోరుతూ బుధవారం ఆయన రాజాం, సంతకవిటి, రేగిడి, వంగర మండలాల్లోని పాఠశాలలు, కళాశాలల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, అధ్యాపకులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ శాసన మండలిలో ఉపాధ్యాయుల, ఉద్యోగుల కోసం పిడిఎఫ్ ఎమ్మెల్సీలు చేస్తున్న కృషిని, వారు పోరాడుతున్న తీరును వివరించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడుతున్నది కేవలం పిడిఎఫ్ ఎమ్మెల్సీలు మాత్రమేనని అన్నారు. ఈనేపథ్యంలో మన సమస్యలపై శాసనమండలిలో గళం వినిపించేందుకు విజయగౌరికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పి.వాసు, ఆడిట్ కమిటీ సభ్యులు ఎవి నాయుడు, ఎం.కృష్ణమూర్తి, ఎవి గౌరినాయుడు, గేదెల రమేష్, బి.నాగేశ్వరరావు, ఎం.రమేష్, ఎం.శ్రీనివాసరావు, జి.అప్పలనాయుడు, ఆర్.దాలినాయుడు, డోల కృష్ణారావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సురేష్ ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జె.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఫ్యాప్టో పూర్వచైర్మన్ బాబురెడ్డి

బెదిరింపులు సరికాదు : మంత్రి కొండపల్లి

ప్రజాశక్తి-విజయనగరంకోట

మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఈనెల 18న జైల్లో ఉన్న వల్లభనేని వంశీని చూడ్డానికి వెళ్లి వచ్చి ప్రెస్ మీట్ లో మాట్లాడిన తీరును ఖండిస్తున్నామని రాష్ట్ర చిన్న మధ్య తరహా పరిశ్రమల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం టిడిపి కార్యాలయం అశోక్‌బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తన బాధ్యతను మరిచి బెదిరింపులకు పాల్పడం సరికాదన్నారు. గత ఐదేళ్లలో ప్రతి శాఖను జగన్మోహన్ రెడ్డి నాశనం చేశారన్నారు. గత ప్రభుత్వంలో అధికారంలో ఉన్నప్పుడు టిడిపి కార్యాలయం పై జరిగిన దాడిపై ఫిర్యాదు చేసేందుకు వస్తున్న వ్యక్తిని సైతం కిడ్నాప్ చేసే ప్రయత్నం చేశారన్నారు. జగన్మోహన్ రెడ్డి ఒక మాజీ ముఖ్యమంత్రిని మరిచి మాట్లాడిన తీరు ప్రజలను భయభ్రాంతులకు గురి చేసేలా ఉందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజలకు సుపరిపాలన అందిస్తూ ఉంటే దానిని చూసి ఓర్వలేక ఇటువంటి చర్యలకు మాటలకు పాల్పడడం సరికాదన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి, టిడిపి పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మి వరప్రసాద్, పార్టీ నాయకులు పాల్గొన్నారు

జెఎన్‌టియులో జాతీయ సదస్సు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెఎన్‌టియు గురజాడలో ఇసిఇ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ఈసెంట్రా 2కె 25 అనే రెండు రోజుల అంతర్జాతీయ సాంకేతిక సదస్సు బుధవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ఇంజినీరింగ్ కళాశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన విశ్వవిద్యాలయ ఇంచార్జి ప్రొఫెసర్ డి. రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి వ్యక్తిగత, వృత్తిపరమైన అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న పదవీ విరమణ పొందిన ఎన్ఎస్‌టిఎల్‌జి శాస్త్రవేత్త బివివిఎస్ కృష్ణకుమార్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సాటిలైట్ కమ్యూనికేషన్, సెమీ-కండక్టర్స్ గురించి వివరించారు. కార్యక్రమంలు పలువురు ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ కబడ్డీ పోటీలకు శశికుమార్ ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



ఈనెల 20 నుంచి 23వరకు కటక్‌లో జరగబోయే జాతీయ సీనియర్ పురుషుల కబడ్డీ పోటీలకు విజయనగరం జిల్లాకు చెందిన శశికుమార్ ఎంపికయ్యాడు. శశికుమార్ గత నెలలో రాష్ట్ర పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచినందుకు రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడు. ఆయన ఎంపిక పట్ల జిల్లా కబడ్డీ సంఘ చైర్మన్ ఐవిపి రాజు, అధ్యక్షులు రంగారావు, కార్యదర్శి ప్రభావతి, ఆర్గనైజింగ్ కార్యదర్శి లక్ష్మణరావు ,ట్రెజరర్ శివకుమార్, మరియు సంఘ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

23న ఐదు జిల్లాల చదరంగం పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 23న విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం, మన్యం, అనకాపల్లి క్రీడాకారులకు ఓపెన్ చదరంగం పోటీలు శ్రీ చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం, ఫైర్ చెస్ స్కూల్ వారు కలిసి నిర్వహిస్తామని అసోసియేషన్ కార్యదర్శి కెవి జ్వాలాముఖి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలలో ఓపెన్ విభాగంలో రూ.30వేలు నగదు బహుమతి, అండర్-7, 9,11,13,15 పిల్లల విభాగంలో ప్రత్యేక నగదు బహుమతులు ఉన్నాయని తెలిపారు. వివరాలకు apchess.org వెబ్‌సైట్‌లో పేర్లు నమోదుకు 9703344488 నెంబరులో సంప్రదించాలని కోరారు.

వసతి గృహాలను సందర్శించిన న్యాయమూర్తులు

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

నగరంలోని సుంకరవీధిలోగల ప్రభుత్వ ఎస్‌సి బాలికల వసతి గృహాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ్‌చక్రవర్తి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి టివి రాజేష్‌కుమార్ బుధవారం పరిశీలించారు. ఇక్కడగల రెండు హాస్టల్లో ఉన్న స్టోర్ రూమ్‌లను పరిశీలించారు. విద్యార్థులకు సరిపడా పప్పు దినుసులు, ఆయిల్ విద్యార్థులకు సరిపడినంతగా లేనట్లు గమనించి అసహనం వ్యక్తం చేశారు. మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. సరిపడా బెడ్స్ లేని కారణంగా నేల మీదే పండుకుంటున్నట్లు విద్యార్థినులు తెలిపారు. వసతి గహంలో ఉంటున్న బాలికలకు సరిపడా కాస్మోటిక్ మరియు సానిటరీ నాప్కిన్స్, అందుతున్నాయా లేదా వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ కూర్మానందరావు, ఎంఇఒ పి.సత్యవతి, టూటౌన్ ఎస్ఐ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

తూనికలు కొలతలశాఖ అధికారుల తనిఖీలు

విజయనగరం : తూనికలు, కొలతలశాఖ ఇన్‌స్పెక్టర్ ఎం. దామోదర నాయుడు విజయనగరం, బొండపల్లి మండలాల్లో పలు వ్యాపార సంస్థలను తనిఖీ చేసి 10 కేసులు నమోదుచేశారు. తూనిక యంత్రానికి సీళ్లు లేకపోవడంతో 3 కేసులు, తూకంలో మోసం చేసిన వారిపై 4 కేసులు, ప్యాకేజీలపై ముద్రించిన అమ్మకపు ధర కంటే అధికంగా విక్రయించిన వారిపై 3 కేసులు నమోదు చేశారు.

జిబిఎస్ సిండ్రోమ్‌పై ఆందోళన వద్దు

- జిజిహెచ్‌లో ప్రత్యేక విభాగం ఏర్పాటు
- మందులు, చికిత్స అందుబాటులో ఉన్నాయి
- కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

గులియన్ బారి సింద్రోం (జిబిఎస్) వ్యాధి పట్ల ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అన్నారు. ఈ నాడి సంబంధిత వ్యాధి కొత్తది కాదని, అరుదుగా మాత్రమే కొందరిలో కనిపిస్తుందని చెప్పారు. వైరల్ ఇన్‌ఫెక్షన్, బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్ వచ్చి తగ్గిన తరువాత వచ్చే ఈ వ్యాధిని ఎదుర్కొనడానికి జిల్లా యంత్రాంగం సిద్దంగా ఉందని అన్నారు. జిబిఎస్ సింద్రోం వ్యాప్తి, కారణాలు, నిరోదానికి తీసుకోవాల్సిన చర్యలపై తమ ఛాంబర్‌లో సంబంధిత అధికారులతో బుధవారం జిల్లా కలెక్టర్ తమ ఛాంబర్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిబిఎస్ వ్యాధిని ఎదుర్కొనడానికి జిల్లా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ వ్యాధిని నిర్ధారణ చేయడానికి, అదుపుచేయడానికి అవసరమైన సదుపాయాలు, మందులు, చికిత్స అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రతీఒక్కరూ పరిశుభ్రత పాటించాలని, పరిశుభ్రమైన తాగునీరు, ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఈ వ్యాధి లక్షణాలు ఏమైనా కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. తాగునీటి పథకాలను షెడ్యూల్ ప్రకారం క్లోరినేషన్ చేయాలని, నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని, పారిశుధ్య కార్యక్రమాలను ముమ్మరం చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.జీవనరాణి, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.అప్పలనాయుడు మాట్లాడుతూ, ఈ వ్యాధి లక్షణాలు, కారణాలను, అదుపు చేయడానికి తీసుకున్న చర్యలను వివరించారు. శరీరంలోని రోగనిరోదక వ్యవస్థ నరాలపై దాడిచేయడం వల్ల ఈ వ్యాధి వస్తుందని, ఇదొక ఆటో ఇమ్యూన్ వ్యాధి అని పేర్కొన్నారు. దీనివల్ల కాళ్లు, చేతులు బలహీనపడటం, చలనం తగ్గిపోవడం, కొన్నిసార్లు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఏర్పడతాయని తెలిపారు. ఈ వ్యాధి 80 శాతం మందికి సహజంగానే తగ్గిపోతుందని, 15 శాతం మందికి చికిత్స అవసరమని, కేవలం 5 శాతం మందికి మాత్రమే పరిస్థితి విషమంగా మారుతుందని వివరించారు. సమావేశంలో జెడ్‌పి ఇన్‌ఛార్జి సిఇఒ ఆర్.వెంకటరామన్, డిపిఒ టి.వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ కవిత, మున్సిపల్ కమిషనర్ పి.నల్లనయ్య, డిసిహెచ్ఎస్ డాక్టర్ రాజ్యలక్ష్మి, ఇతర వైద్యాధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

బైండోవర్ కేసులు రద్దు చేయకపోతే పోరాటం

సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని

ప్రజాశక్తి - బొబ్బిలి

బొబ్బిలిలో పాకివీధి పక్కనున్న ఖాళీ స్థలంలో పారిశుధ్య కార్మికులు వేసుకున్న పాకలను మున్సిపల్, రెవెన్యూ, పోలీసులు బుధవారం తొలగించారని, పారిశుధ్య కార్మికులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని పోరాటం చేసిన నాయకులు, కార్మికులపై బైండోవర్ కేసులు పెట్టడం సరికాదని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 1991లో ఇళ్ల స్థలాలు ఇస్తామని ఒకొక్కరి నుంచి రూ 361 డబ్బులు కట్టించుకున్న అధికారులు స్థలాలు ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. ఇళ్ల స్థలాలు ఇవ్వాలని పోరాటం చేస్తే బైండోవర్ కేసులు పెట్టడం అన్యాయమన్నారు. కేసులను రద్దు చేయకపోతే పోరాటం చేస్తామన్నారు. ఇళ్ల పట్టాలు ఇస్తామని ఎమ్మెల్యే బేబినాయన హామీ ఇవ్వడం అభినందనీయమన్నారు.

మున్సిపల్ కార్మికుల కు ఇళ్ల స్థలాలివ్వాలి

సాలూరు : గత కొంత కాలంగా బొబ్బిలి మున్సిపల్ కార్మికులు మున్సిపాలిటీ స్థలంలో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న ప్రదేశాల్లో పోలీసులు దాడి చేసి గుడిసెలను తీసేయడం, మహిళలను చూడకుండా లాగేయడాన్ని ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎన్‌వై నాయుడు ఖండించారు. ఇళ్ల స్థలాల కోసం పోరాడుతున్న మున్సిపల్ కార్మికులకు వారి కుటుంబాలకు సంఘీభావం తెలిపారు. ఎమ్మెల్యే బేబినాయన వెంటనే మున్సిపల్ కార్మికుల కుటుంబాలకు అదే ప్రదేశంలో పట్టాలు ఇవ్వాలని కోరారు. మన్యం జిల్లాలోని పాలకొండ, పార్వతీపురం, సాలూరు, విజయనగరం జిల్లాలోని నెల్లిమర్ల, రాజాం. విజయనగరం తదితం చోట్ల కూడా కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీల శుభ్రతను చూస్తున్న అట్టడుగు వర్గాల కార్మికులు పారిశుద్ధ్య కార్మికులను అలాంటి వారి సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం వెనుకడుగు వేయడం సరికాదని తెలిపారు. ఈ సమస్య పరిష్కరించాలని లేకుంటే ఈ ప్రాంతాల్లో కూడా భవిష్యత్తులో పోరాటానికి వెనుకడుగు వేయమని తెలిపారు.

పెండింగు ఇ-చలానాలు చెల్లించేలా చర్యలు

ప్రజాశక్తి-విజయనగరంకోట



జిల్లాలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టి వాహనాలపై పెండింగులో ఉన్న ఈ- చలానాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఎస్‌పి వకుల్ జిందాల్ ఆదేశించారు. ఇందుకోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని, అవసరమైతే వాహనాలను సీజ్ చేయాలని సూచించారు. బుధవారం పోలీసు అధికారులతో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు తమ పోలీసు స్టేషను పరిధిలో వాహన తనిఖీలు చేపట్టాలన్నారు. తనిఖీల్లో వాహనాల రికార్డులను పరిశీలించి, ఆయా వాహనాలపై ఏమైనా పెండింగు ఈ-చలానాలు ఉన్నవి, లేనిది చెక్ చేయాలన్నారు. ఈ-చలానాలు పెండింగులో ఉన్నట్లయితే, వాటిని వాహనదారులు చెల్లించే వరకు వాహనాలను సీజ్ చేయాలన్నారు. వాహన తనిఖీలు చేపట్టే సమయాల్లో ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడితే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు.

అనుమానితుల నేర చరిత్ర ఫింగర్ ప్రింట్ డివైజ్ తో గుర్తింపు

నగర పరిధిలో రాత్రి పెట్రోలింగ్, గస్తీ, వాహన తనిఖీల్లో అనుమానితుల నేర చరిత్రను గుర్తించేందుకు జిల్లా ఎస్‌పి వకుల్ జిందల్ ఆదేశాలతో ఫింగర్ ప్రింట్ డివైజ్‌లను వినియోగిస్తున్నామని వన్‌టౌన్ సిఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. రాత్రి సమయాల్లో అనుమానా స్పదంగా సంచరిస్తున్న వ్యక్తుల నేర చరిత్రను గుర్తించి, వారిపై చర్యలు చేపడుతున్నామన్నారు. డివైజ్ ను వినియోగించి అనుమానితుల వేలి ముద్రలను చెక్ చేస్తే, వారి నేర చరిత్ర క్షణాల్లో తెలిసిపోతుందన్నారు. ఈ డివైజ్ వినియోగించి రాత్రి సమయాల్లో పట్టణంలో సంచరించే అనుమానాస్పద వ్యక్తులను తనిఖీ చేసి, వారు పాత నేరస్తులా? ఏమైనా నేర చరిత్ర ఉందా? అన్న విషయాన్ని గుర్తించి, వారిపై చర్యలకు ఉపక్రమిస్తున్నామన్నారు. రాత్రి పెట్రోలింగ్, గస్తీ, వాహన తనిఖీల్లో వీటిని వినియోగిస్తున్నట్లు తెలిపారు. వన్ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని రద్దీ ప్రాంతాలు, ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో పోలీసు సిబ్బంది ఫింగర్ ప్రింట్ డివైజ్ వినియోగిస్తున్నట్లు తెలిపారు.

స్టిక్కర్లు తొలగించండి : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో అనేక ప్రాంతాలలో వివిధ సంస్థలకు చెందిన వారు వివిధ రకాల స్టిక్కర్లు, ప్రకటనా బోర్డులను ప్రతి ఇంటి గేటులకు అమర్చుతున్నారని వాటిని ప్రజలందరూ స్వచ్ఛందంగా తొలగించుకోవాలని కమిషనర్ నల్లనయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కొంతమంది గోడల పైన విచ్చలవిడిగా ట్యాంక్ క్లీనింగ్ లంటూ తమ ప్రచారాలనురాస్తూ గోడలను అపరిశుభ్రపరుస్తున్నారని, ఇక నుంచి గోడ రాతలు రాయకూడదని స్పష్టం చేసారు. నగరాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దే ప్రక్రియలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు

నగర వీధులతో పాటు శివారు ప్రాంతాలలో కూడా పారిశుద్ధ్య పనితీరును మెరుగుపరిచేందుకు కషి చేస్తున్నామని కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. పలు ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాలను, పూడికలను ప్రజారోగ్య సిబ్బంది తొలగించారు.

పార్కింగ్ స్థలాలు కేటాయించాలని ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో ఆటోలకు పార్కింగ్ స్థలాలు కేటాయించాలని కోరుతూ ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మికి విజయదుర్గా ఆటో వర్కర్లు యూనియన్ అధ్యక్షులు రెడ్డి నారాయణరావు ఆధ్వర్యాన బుధవారం వినతి అందజేశారు. నగరంలో 1997 నుంచి ఆటో యూనియన్ ఏర్పడింది. అనేక సార్లు పార్కింగ్ స్థలాలు కేటాయించాలని అనేక ఆందోళనలు చేపట్టామని తెలిపారు. ఆటోస్టాండులు వలన ట్రాఫిక్ అంతరాయం లేదని చెప్పినప్పటికి ట్రాఫిక్ పోలీసులు ఒప్పుకోవడం లేదన్నారు. ఆటోస్టాండులను యదావిధిగా కొనసాగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి అందజేసిన వారిలో అప్పలరాజు, సన్యాసిరావు, ధర్మారావు, రాము తదితరులు పాల్గొన్నారు.

సమగ్రాభివృద్ధి బాల్య దశ నుంచే జరగాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జ్ఞాన జ్యోతి 120 రోజుల సర్టిఫికెట్ కోర్సులో భాగంగా మండలంలో గల 84 మంది అంగన్వాడీ కార్యకర్తలకు 6 రోజుల శిక్షణను జిల్లా ఉప విద్యాశాఖాధికారి కె.వి.రమణ, సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు సిఎంఒ ఆదినారాయణ, ఎఎంఒ ప్రసాద్, ఐఇ కో ఆర్డినేటర్ సూర్యారావు సందర్శించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ పిల్లల సమగ్రాభివృద్ధి బాల్యదశ నుండే జరగాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 శ్రీరాము, స్థానిక ప్రధానోపాధ్యాయులు కృష్ణ, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

బొబ్బిలి: వాహన నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎన్.రమేష్ కుమార్, జి.సత్యనారాయణ హెచ్చరించారు. బొబ్బిలి-బలిజిపేట రోడ్డులో బుధవారం వాహనాలను తనిఖీ చేశారు. ట్రాఫిక్, వాహన నిబంధనలు పాటించి ప్రమాదాలు నివారణకు సహకరించాలని వాహనదారులను కోరారు. హెల్మెట్ లేకుండా డ్రైవ్ చేసిన ద్విచక్ర వాహనదారులు, సీటు బెల్ట్ పెట్టని వారిపైన, బీమా, వాహన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ లేనివారిపై కేసులు నమోదు చేసి అపరాధ రుసుం విధించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులు చదువులో ముందుండాలి

మెంటాడ: గిరిజన విద్యార్థులు చదువులో ముందంజలో వుండాలని, తద్వారా తమ కుటుంబ జీవన విధానం మార్పు చెందాలని ఆంధ్ర ఎస్ఐ కె.సీతారాం కోరారు. బుధవారం పోలీసు ఫ్రెండ్లీ కార్యక్రమంలో భాగంగా లోతుగెడ్డ పంచాయతీ పరిధిలోని గిరిజన గ్రామం ఉయ్యాడవలసలో పేదలకు దుప్పట్లు, యువతకు వాలీబాల్ కిట్లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యానికి, గంజాయి మత్తుకు అలవాటు పడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దు అని చెప్పారు. గిరిజనాభివృద్ధికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని వాటిని సద్వినియోగం చేసుకుని అభివృద్ధిలోకి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీసు సిబ్బంది, గిరిజనులు పాల్గొన్నారు.

చురుగ్గా సిసి రోడ్ల నిర్మాణ పనులు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని కృష్ణారెడ్డిపేట పంచాయతీ పరిధిలోని అంకజోష్యుల పాలెంలో సీసీ రోడ్ల నిర్మాణానికి ఉపాధి హామీ నిధులు రూ. 10లక్షలు మంజూరయ్యాయి. ఇందులో రూ.2లక్షలతో గొంపవారి వీధిలో సీసీ రోడ్డు పనులు చురుగ్గా సాగుతున్నాయి. మిగిలిన రూ.8లక్షలతో మరో సీసీ రోడ్డు నిర్మాణ పనులు కూడా త్వరితగతిన పూర్తిచేస్తామని టిడిపి గ్రామ కమిటీ సభ్యులు ఈసారపు రమణ, గొంప సూర్యనారాయణ తెలిపారు.



సీసీ రోడ్డును పరిశీలిస్తున్న నాయకులు

ఒత్తిడిని అధిగమిస్తే విజయం

వేపాడ: విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడిని అధిగమించితే విజయం సాధించవచ్చునని మానసిక ఆరోగ్య కౌన్సిలర్ బోగి సంధ్య అన్నారు. స్థానిక గురుకుల పాఠశాలలో బుధవారం విద్యార్థినులకు ఒత్తిడిని అధిగమించడంపై కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరీక్షలంటే భయం, తీవ్ర ఒత్తిడి, డిప్రెషన్, మానసిక వ్యక్తిగత సమస్యలు లేకుండా చూసుకోవాలన్నారు. ముఖ్యంగా పరీక్షా సమయంలో ఒత్తిడి లేకుండా చూసుకోవాలన్నారు. పది, ఇంటర్ పాస్ అయిన తరువాత ఏమి చెయ్యాలి? మీకు ఇష్టమైన కెరియర్ వైపు వెళ్ళందుకు ఏమి చదవాలి? అనే అంశం పై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ యు ఉషారాణి, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టాలు లేకుండా ఇళ్లు నిర్మిస్తే కఠిన చర్యలు

బొబ్బిలి: ఇళ్ల పట్టాలు లేకుండా ఇళ్లు నిర్మాణం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ ఎం.శ్రీను హెచ్చరించారు. ఇందిరమ్మ కాలనీలో ఇళ్ల స్థలాలు ఆక్రమణలు జరిగినట్లు ఆరోపణలు రావడంతో బుధవారం నిర్మాణాలను పరిశీలించారు. ఇళ్ల పట్టాలు లేకుండా స్థలాలు ఆక్రమించి నిర్మాణాలు చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్ఐ రాంకుమార్‌ను ఆదేశించారు. ఇళ్ల స్థలాల ఆక్రమణలపై నిఘా పెట్టాలని కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

బొప్పడాంలో పోలీసుల పల్లె నిద్ర

నెల్లిమర్ల: పోలీసులు బొప్పడాంలో మంగళవారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ బి.గణేష్ ఆధ్వర్యంలో మొదట గ్రామస్తులతో మీటింగ్ కండక్ట్ చేసి వారితో మమేకమై వాళ్లకి ప్రస్తుత సమాజంలో జరుగుతున్న నేరాలు, దొంగతనాలు, సైబర్ నేరాలు, రోడ్డు భద్రత పిల్లల చదువు ప్రాముఖ్యత, ఇతర అంశాల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం బీసీ వెల్ఫేర్ హాస్టల్‌ని ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థుల సంక్షేమానికి తీసుకోవాల్సిన చర్యలు గురించి సిబ్బందితో చర్చించారు. అనంతరం రాత్రి బస చేశారు.

ఆధార్ కేంద్రాలను వినియోగించుకోవాలి

నెల్లిమర్ల: ఆధార్ నమోదు కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ కె.రామకృష్ణరాజు కోరారు. గురువారం ఆయన సతివాడ, వల్లూరు ఆధార్ నమోదు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆధార్ నమోదు మీ గ్రామాల్లోకి తీసుకు వచ్చిందని ఈ నెలాఖరులోగా ఆధార్ నమోదు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోషకాహార బ్యాగులు పంపిణీ

మెంటాడ: జిల్లా వ్యాప్తంగా 100 రోజులు జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా బుధవారం పోషకాహార బ్యాగులను మెంటాడ పిహెచ్‌సి వైద్యాధికారులు జె.లోకప్రియ, జి కల్పనలు పంపిణీ చేశారు. క్షయవ్యాధి ఊపిరి తిత్తులకు బాక్టీరియా వైరస్ సోకడం వల్ల ఈ వ్యాధికి గురవు తారన్నారు. ఈ నేపథ్యంలో రోగులు సక్రమంగా మందులు వాడినట్లెయితే పూర్తిగా వ్యాధిని నిర్మూలించవచ్చునని తెలిపారు. క్షయ పోషణ యోజన ద్వారా రోగులకు వెయ్యి రూపాయలు, పోషకాహారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒఎస్ సత్యనారాయణ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

21, 22న వాలీబాల్ పోటీలు

కొత్తవలస: మండలంలోని కంటకాపల్లి వద్ద గల శారదా కంపెనీ ఆధ్వర్యంలో అంతర్ నియోజవర్గాల వాలీబాల్ పోటీలు నిర్వహిస్తామని జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గవర సూరిబాబు తెలిపారు. ఈ పోటీలు ఈనెల 21, 22 తేదీలలో శరదా కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహిస్తారాన్నరు. ఈ పోటీలలో గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా రూ.1.25 లక్షలు, రెండో బహుమతిగా రూ.60వేలు, మూడో బహుమతిగా రూ.30వేలు, నాల్గో బహుమతిగా రూ.25వేలు ఇస్తారన్నారు. పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులందరికీ రవాణా ఛార్జీలను కూడా ఇస్తామన్నారు. ఈ టోర్నమెంట్ విజయనగరం వాలీబాల్ అసోసియేషన్ సహకారంతో నిర్వహించనున్నట్లు తెలిపారు.

బాడీ బిల్డింగ్ పోటీలకు విశేష స్పందన

బొబ్బిలి: స్థానిక రాజా కళాశాల మైదానంలో బుధవారం నిర్వహించిన బాడీ బిల్డింగ్ పోటీలకు విశేష స్పందన లభించింది. శివాజీ జయంతి సందర్భంగా బొబ్బిలి రాజులు సహకారంతో హనుమాన్ దీక్షా సేవా సమితి ఆధ్వర్యంలో జోనల్ స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహించారు. విజయనగరం, శ్రీకాకుళం, విశాఖ, పార్వతీపురం మన్యం జిల్లాల నుంచి 120మంది క్రీడాకారులు హాజరయ్యారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

ఆధ్యాత్మిక ఝురి...పుణ్యగిరి

- దక్షిణ కాశీగా పేరొందిన పుణ్యక్షేత్రం
- ఇక్కడే వెలసిన కోటిలింగాలు
- మహాశివరాత్రికి ముస్తాబు
- ఏర్పాట్లలో అధికారులు నిమగ్నం

పుణ్యగిరి ప్రముఖ దైవ క్షేత్రం. ఇటు ప్రకృతి రమణీయతకు అటు ఆధ్యాత్మిక శోభకు ఆలవాలం ఈ క్షేత్రం. ఈ క్షేత్రంలో గల శివలింగాన్ని నిత్యం అభిషేకిస్తూ వస్తున్న జలధారలో స్నానమాచరించి ఉమా కోటి లింగేశ్వర స్వామిగా వెలసిన పరమశివుని భక్తులు దర్శించుకుంటే సర్వ పాపాలు వైదొలగుతాయని నమ్మకం. దక్షిణ కాశీగా పేరుందిన ఈ క్షేత్రంలో పూర్వం ఎంతోమంది మునీశ్వరులు తపస్సు చేసుకుంటూ శివుని ఆరాధిస్తూ ఉండేవారని. ఈ క్రమంలోనే శివ సాక్షాత్కారం పొందారని అందుకే ఇక్కడ శివుడు లింగ రూపంలో వెలిశాడని కథనం. దీంతో ఇక్కడ శివరాత్రికి ప్రాముఖ్యత సంతరించుకుంది. ఈ నేపథ్యంలో శివరాత్రి వేడుకలకు పుణ్యగిరి సర్వసిద్ధమవుతోంది.

ప్రజాశక్తి - శృంగవరపుకోట

పుణ్యగిరి కొండపై గల శ్రీ ఉమాకోటి లింగేశ్వర స్వామి ఆలయం ఈ నెల 26న జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతుంది. రెండు రోజులపాటు నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాలలో స్వామి దర్శనానికి విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాలలతో పాటు ఉభయ గోదావరి జిల్లాలు, ఒరిస్సా రాష్ట్రం నుంచి కూడా సుమారు లక్షమంది వరకు భక్తులు క్షేత్రానికి వస్తారు.

ఇప్పటికే పంచాయతీ సిబ్బంది పుణ్యగిరికి వెళ్లే రహదారికి ఇరువైపులా గల తుప్పలను తొలగించి రోడ్డును విశాలం చేశారు. పట్టణంలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. రోడ్డుపై పూడుకుపోయిన మట్టిని తొలగించి రోడ్డు మార్జిన్ దాటి దుకాణాలు గానీ వాహనాలు గాని ఉంచరాదని ఆదేశించారు. శివరాత్రి వేడుకల్లో భాగంగా భక్తుల ఆహ్లాదం కోసం పట్టణంలోని ఆకుల డిపో వద్ద, ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలోనూ ఎగ్జిబిషన్‌లు ఏర్పాటు కానున్నాయి.

భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా ఏర్పాట్లు

మహాశివరాత్రి సందర్భంగా పుణ్యగిరి శ్రీఉమా కోటి లింగేశ్వర స్వామి దర్శనానికి, ధర్మవరం పంచాయతీ సన్యాసయ్యపాలెం గ్రామంలో గల సన్యాసేశ్వర స్వామి దేవాలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా ఏర్పాట్లు చేయాలని తహశీల్దార్ అరుణకుమారి వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. మహాశివరాత్రి సందర్భంగా చేయవలసిన ఏర్పాట్లపై బుధవారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈనెల 27వ తేదీన ఎమ్మెల్సీ ఎన్నికలు ఉన్నందున పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో వాహనాల పార్కింగ్‌కు వీలు కాదని అందుకు పోలీసులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి వాహన రద్దీని అరికట్టాలని, పంచాయతీ



వివిధ శాఖల అధికారులతో మాట్లాడుతున్న తహశీల్దార్ అరుణకుమారి

వారు లైటింగ్, వాటర్, రోడ్లు తడపడం, మొబైల్ టాయిలెట్స్, నిరంతర విద్యుత్ వైద్యం వంటివి పర్యవేక్షించాలని ఆదేశించారు. మహాశివరాత్రికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యమూ కలగకుండా చేయవలసిన ఏర్పాట్లపై అధికారులు సమన్వయంతో పనిచేసి యాత్రికుల మన్ననలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల మండల అధికారులు పోలీసు, ఎక్సైజ్, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడులను అరికట్టాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జర్నలిస్ట్‌లపై దాడులు అరికట్టాలని నెల్లిమర్ల ప్రెస్‌క్లబ్ సభ్యులు కోరారు. బుధవారం మక్కువ ప్రజాశక్తి విలేకరి రామారావుపై టిడిపి నాయకులు దాడికి నిరసిస్తూ ప్రెస్‌క్లబ్ సభ్యులు జర్నలిస్ట్‌లపై దాడులు అరికట్టాలని తహశీల్దార్‌కి, స్థానిక ఎస్ఐకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కాళ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో పత్రికలకు వార్తలు రాసే హక్కువుందని వార్తను జీర్ణించుకోలేక టిడిపి నాయకులు దాడులు చేసి చంపుతామని బెదిరించడం భౌతిక దాడులకు పాల్పడడం దారుణమన్నారు. సమాజంలో పత్రికలు భాగస్వామ్యమని వార్తలు వెలుగులోకి తీసుకువచ్చి సమాజాన్ని మేలుకొలుపుతాయని లోపాలుంటే వాటిని సరి చేసుకోవాలి తప్ప దాడులు చేయడం సరికాదన్నారు. విలేకరిపై దాడి చేసిన టిడిపి నాయకుడుపై చర్యలు తీసుకొని అరెస్ట్ చేయాలని



నెల్లిమర్ల: తహశీల్దార్‌కు వినతినిస్తున్న జర్నలిస్టులు

డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ప్రెస్ క్లబ్ సభ్యులు ఉన్నారు.

బాడంగి: మక్కువ విలేకరి ఎం.రామారావుపై టిడిపి మండల అధ్యక్షుడు జి.వేణుగోపాలనాయుడు దాడి చేయడం అప్రజాస్వామికమని బాడంగి జర్నలిస్టుల నాగరాజు, కృష్ణమూర్తి, రాజా సాహెబ్, రామకృష్ణ, సీతారాం అన్నారు. విలేకరిపై దాడి చేసిన టిడిపి నేతపై కేసు పెట్టాలని కోరుతూ తహశీల్దార్ సుధాకర్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకుని జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని కోరారు.

విలేకరిపై దాడికి ఎఐఎఫ్‌టియు ఖండన

విజయనగరం టౌన్: మక్కువలో ప్రజాశక్తి విలేకరిపై తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు గుల్ల వేణుగోపాల్ నాయుడు దాడి చేయడాన్ని ఎఐఎఫ్‌టియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బెహరా శంకరరావు ఖండించారు. భౌతికదాడికి పాల్పడి అసభ్య పదజాలాన్ని ఉపయోగించి చంపివేస్తానని బెదిరించడం దారుణం ఇటువంటి చర్యలను అన్ని రాజకీయ పక్షాలు ప్రజాసంఘాలు ఖండించాలని ఒక ప్రకటనలో కోరారు. పోలీసు యంత్రాంగం నిష్పక్షపాతంగా అధికార పార్టీ నేతపై కేసు రిజిస్టర్ చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.



పిల్లలతో మాట్లాడుతున్న సూర్యారావు

భవిత కేంద్రం సందర్శన

ప్రజాశక్తి- డెంకాడ

జిల్లా సహిత విద్య సమన్వయకర్త సిరికి సూర్యారావు భవిత ప్రత్యేక అవసరాల గల పిల్లల వనరుల కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన వికలాంగ విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న ప్రగతిని, సౌకర్యాలను, దస్త్రాలను పరిశీలించారు. వికలాంగ విద్యార్థుల హాజరు పట్టికలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఫిజియో థెరపీ హాజరు పెంచమని ఐఇఆర్‌పిలు బి.రవీంద్రరావు, అప్పలరాజులను కోరారు.

పతివాడను కలిసిన స్పీకర్ అయ్యన్న

ప్రజాశక్తి - పూసపాటిరేగ

'మా బంధం ఎప్పటిదోనని మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామినాయుడును కలసిన స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు' అన్నారు. బుధవారం మండలంలోని మాజీ మంత్రి పతివాడ నారాయణ స్వామినాయుడు స్వగ్రామం చల్లవానితోటలో ఆయన స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఇరువురు కుశల ప్రశ్నలు వేసుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా అయ్యన్న పాత్రుడు మాట్లాడుతూ మండలంలోని ఎస్ఎంఎస్ ఫార్మాలో నూతనంగా నిర్మించిన బ్లాక్‌ను ప్రారంభిం చామన్నారు. ఈ సందర్భంగా నారాయణస్వామినాయుడును కలిసేందుకు వచ్చినట్లు తెలిపారు. తన పెళ్లి దగ్గరుండి చేసిందీయనేనని పతివాడ గురించి చెప్పారు. అన్న ఎన్‌టిఆర్ దగ్గరకు వెల్లాంటే తాము ఇద్దరం కలసి వెల్లేవారిమని గుర్తు చేసుకున్నారు. తనను అబ్బాయ్ ఇలా రా అని



మాజీ మంత్రి పతివాడను కలిసిన స్పీకర్ అయ్యన్న పాత్రుడు

పిలిచే వారు ఈయన ఒక్కరేనని అన్నారు. అనంతరం పతివాడ మనువడు పెండ్లి కుమారుడు రామానాయుడును ఆశీర్వదించారు. పతివాడ కుటుంబీకులు తమ్మునాయుడు, అప్పలనాయుడుతో పాటు మిగిలిన వారిని పరిచయం చేసుకున్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యానికి మేలు

ప్రజాశక్తి- మెంటాడ

చిరుధాన్యాల్లో పోషకాలు అధికంగా ఉండి ఆరోగ్యానికి దోహదపడతాయని తహశీల్దార్ కె.శ్రీనివాసరావు అన్నారు. మెంటాడలో నూతనంగా నిర్మించిన చిరుధాన్యాలు ఆహార ఉత్పత్తి కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. మండలంలోని గుర్ల గ్రామంలో బుధవారం స్థానిక పైడితల్లి మహిళా ఫెడరేషన్ సభ్యులు చిరుధాన్యాలతో చేసిన ఆహార ఉత్పత్తులను ఆయన పరిశీలించారు. బిస్కెట్లు, చాక్లెట్లు, కేకులు, మిక్సర్ తదితర ఉత్పత్తులను చూసి ఫెడరేషన్ సభ్యులను అభినందించారు. చిరుధాన్యాలపై ప్రజల్లో అవగాహన పెరిగిందన్నారు. ఈ నేపథ్యంలో వాటి సాగును ప్రోత్సహించడం అందరి బాధ్యత అని చెప్పారు. నూతనంగా ప్రారంభమైన యూనిట్ ద్వారా మరిన్ని చిరుధాన్యాల ఆహార ఉత్పత్తులు ప్రజలకు అందుబాటులోకి రావాలని సూచించారు. యాప్రో స్వచ్ఛంధ సంస్థ ఈ యూనిట్ ను నిర్వహిస్తుందన్నారు. ఇందుకు ఎల్ఐసి, హెచ్ఎఫ్ఎల్ సంస్థలు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు సంస్థ ప్రతినిధి చుక్క శ్రీరాములు నాయుడు తెలిపారు. మహిళా సంఘం సభ్యులకు ఉచితంగా రూ.4లక్షలు ఆర్థిక సహాయంతో ప్రోత్సహించినట్లు చెప్పారు. మరిన్ని యూనిట్‌లు నెలకొల్పనున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ భానుమూర్తి, ఎస్‌కోట తహశీల్దార్ అరుణకుమారి, సింగం పల్లి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

హోంకంపోస్టింగ్‌పై అవగాహన

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని బాలకావివలస, పెద్ద శిర్లాం గ్రామాల్లో స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మహిళా సంఘాలకు హోమ్ కంపోస్టింగ్, కిచెన్ గార్డెన్ పై రాజాం ఏరియా కోఆర్డినేటర్ ఏ.చిరంజీవి, ఎపిఎం బాసిన గోవిందరావు బుధవారం అవగాహన కల్పించారు. మండలంలో అన్ని గ్రామ సంఘాల సభ్యులకూ వీటిపై అవగాహన కల్పించి, ఆసక్తి ఉన్న సభ్యుల వివరాలు ఐ హెచ్‌హెచ్‌పి యాప్‌లో విఒఎలు నమోదు చేయాలని తెలిపారు. సభ్యులు ఇంటి ముందు, వెనుక భాగంలో కొద్ది పాటి ఖాళీ స్థలంలో ఆకు కూరలు, కూరగాయలు వేసుకొని, రసాయనిక ఎరువులు, పురుగుమందులు లేకుండా కంపోస్ట్ పిట్ ద్వారా తయారు చేసిన ఎరువు వేసి పండించుకొని ఆహారాన్ని బుజిస్తే ఎటువంటి రోగాలు లేకుండా ఆరోగ్యంగా ఉండాటానికి అవకాశం ఉందని ఆయన తెలిపారు. సంఘ సభ్యులు జీవనోపాధి మెరుగు పరిచేందుకు బ్యాంకు అనుసంధానంతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు 35 శాతం సబ్సిడీతో అందించినట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారంతా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వీరితో ఫీల్డ్ అసిస్టెంట్ ఉన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు క్రాష్ ప్రోగ్రాం

ప్రజాశక్తి - రామభద్రపురం

రాబోయే వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు క్రాష్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నామని ఎంపిడిఒ రత్నం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సమ్మర్ క్రాష్ ప్రోగ్రాంను బుధవారం ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో మరమ్మతులకు గురైన బోర్లను బాగుచేయించాలని, రక్షిత నీటి పథకాలు క్లోరినేషన్ చేయించి పరిశుభ్రమైన నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా గిరిజన పంచాయతీల్లో తాగునీటి సమస్య రాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ పవన కుమార్, సీనియర్ అసిస్టెంట్ చొక్కావు శ్రీరాములునాయుడు, ఆర్‌డబ్ల్యుఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఆర్‌సి వద్ద ఉపాధ్యాయుల ధర్నా

ప్రజాశక్తి - పూసపాటి రేగ

జీవో 117కు ప్రత్యామ్నాయంగా ఇచ్చిన మెమో ప్రకారం పౌండేషన్ పాఠశాలను ప్రతిపాదన వల్ల కేవలం ఒకటి రెండు తరగతులు మాత్రమే ఉండటంతో డ్రాప్‌అవుట్స్ పెరిగితాయని యుటి ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఎంఆర్‌సి వద్ద ఉపాధ్యాయులు ధర్నా చేశారు. ఈ నిర్ణయం వల్ల ప్రాథమిక పాఠశాలలను రద్దు చేసే అవకాశం ఉందన్నారు. ఉన్నత పాఠశాలలో తెలుగు మీడియం ప్రస్తావన లేదని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను కేటాయింపు లేదని అన్నారు. ప్రతి గ్రామ పంచాయతీకి ఒక మోడల్ ప్రైమరీ పాఠశాలతో పాటు మిగిలిన ప్రాథమిక పాఠశాలలో కనీసం ఇద్దరూ ఉపాధ్యాయులను కేటాయించాలని డిమాండ్ చేశారు. అన్ని పాఠశాలలో ఒకటి నుంచి ఐదు తరగతులను నిర్వహించాలని పౌండే షన్ పాఠశాల ప్రతిపాదన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో తెలుగు ఇంగ్లీష్ మీడియంలు అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయుల విద్యార్థుల నిష్పత్తిని తగ్గించాలని డిమాండ్ చేశారు. ధర్నా కార్యక్రమంలో ఎంయు రాజ్‌కుమార్, మండల అధ్యక్షుడు కార్యద ర్శులు గంగాధర్ రావు, వైకుంఠ రమణా పాల్గొన్నారు.

అంకితభావంతోనే గుర్తింపు

ప్రజాశక్తి -విజయనగరం కోట

అంకిత భావంతో పనిచేసే ఉద్యోగులకు తగిన గుర్తింపు లభిస్తుందని మాజీ కేంద్రమంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు పేర్కొన్నారు. బుధవారం ఎస్‌విఎన్ హోటల్‌లో రోటరీ ఎక్సలెన్స్-2025 అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన అశోక్ గజపతిరాజు మాట్లాడుతూ వృత్తిలో అంకితభావం, చిత్తశుద్ధి తో పని చేసిన వారిని సహ ఉద్యోగులు, వ్యాపారవేత్తలు, విధ్వంసులు స్ఫూర్తిగా తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు నాగేశ్వరరావు, కార్యదర్శి ఆర్.శంకర్రెడ్డి ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వ్యాపారవేత్త రవ్వా శ్రీనివాస్, ప్రముఖ వర్ధమాన సినీ సంగీత దర్శకులు, భీష్మారావు కుమారులు సాయి, పవన్ లకు రోటరీ ఎక్సలెన్స్ అవార్డులను ప్రదానం చేశారు. అనంతరం జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన, పలు శాఖలకు చెందిన ఉత్తమ ఉద్యోగులకు అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో రోటరీ గవర్నర్ డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు, టిఎల్ఎన్ మూర్తి, జయకష్ణ తదితరులు పాల్గొన్నారు. రోటరీ ప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

జనసేనలో పలు కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని 43వ డివిజన్ పరిధిలో 50 కుటుంబాలు వైసిపి నుంచి జనసేనలో చేరాయి. 43వ డివిజన్ వైసిపి మహిళా విభాగం అధ్యక్షురాలు రాయిన సత్యవతి, రాయిన అప్పలనాయుడు ఆధ్వర్యంలో జనసేన నాయకులు అవనాపు విక్రమ్ సమక్షంలో పార్టీలో చేరారు. బాలాజీ నగర్ లోని జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు అవనాపు విక్రమ్ కండువాలు కప్పి, వారందరినీ జనసేన పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అవనాపు విక్రమ్ గారు మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలు, పనితీరు నచ్చి పార్టీలో చేరుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయుకులు పతివాడ చంద్రశేఖర్(చిన్ని),పత్తిగిల్లి వెంకటరావు, ఎం.ఉమా మల్లిఖార్జున రావు తదితరులు పాల్గొన్నారు.

జిబిఎస్ అంటువ్యాధి కాదు

ప్రజాశక్తి - రామభద్రపురం

గులియన్ బారే సిండ్రోమ్ (జిబిఎస్) అంటు వ్యాధి కాదని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మన్యం జిల్లా డిఎంఅండ్ హెచ్ఒ భాస్కరరావు తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇన్ఫెక్షన్ కారణంగా ఈ వ్యాధి సంక్రమించే అవకాశం ఉందని, అంటువ్యాధి మాత్రం కాదని అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో ఇప్పటివరకు ఈ వ్యాధి లక్షణాలు ఎవరికీ లేవని అయితే అప్రమత్తంగా ఉండేలా అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. కళ్ళ తిరగడం, కాళ్ళ తిమ్మెర్లు, తలపోటు, కండరాలు పట్టేయడం వంటి లక్షణాలు ఉంటే అది జిబిఎస్‌గా గుర్తించాలన్నారు. ఈ లక్షణాలు ఉంటే ఆసుపత్రిలో సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వం కూడా దీనిపై చాలా జాగ్రత్తలు తీసుకుంటోందని ఉచితంగా మందులు కూడా పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉందని తెలిపారు.

మలుపు వద్ద లారీ బోల్తా

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని ముంజేరు వెళ్లే రహదారిలో జగ్గయ్యపేట సమీపంలో లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. బుధవారం వేకువ జామున ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. రామచంద్రపేట సమీపంలోని క్వారీ నుంచి భోగాపురం వైపు రాయి పిక్కతో వస్తున్న లారీ జగ్గయ్యపేట శ్మశాన వాటిక వద్దకు వచ్చేసరికి మలుపు వద్ద లారీని డ్రైవర్ అదుపు చేయలేకపోయాడు. దీంతో ఒక్కసారిగా బోల్తా పడింది.

పశుగ్రాస విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి - లక్కవరపుకోట

రైతులకు 75శాతం రాయితీ మీద పశుగ్రాస విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు స్థానిక పశువైద్యాధికారి కోరాడ గాయత్రి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని తన కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ మండలానికి 400 కిట్ల గడ్డి విత్తనాలు ప్రభుత్వం సరఫరా చేసిందని ఒక్కొక్క కిట్టుకు ఐదు కిలోలు కాగా దాని పూర్తి ఖరీదు రూ.460 అని చెప్పారు. ఇందులో రాయితీ పోను రైతు రూ.115 చెల్లించాలని చెప్పారు. పశుగ్రాస విత్తనాల రైతుసేవా కేంద్రంలోని అందుబాటులో ఉన్నాయన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలని ఎంఇఒ-2 జి.వాసు అన్నారు. స్థానిక పొట్టి శ్రీరాములు ఉన్నత పాఠశాలలో అంగన్వాడీలకు బుధవారం రెండో రోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు అర్థమయ్యే రీతిలో బోధించేందుకు ప్రభుత్వం శిక్షణ ఇస్తుందన్నారు. శిక్షణలో బోధన మెళుకువలు నేర్చుకుని పిల్లలకు అర్థమయ్యే రీతిలో బోధన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిడి పిఒ విజయలక్ష్మి, సూపర్ వైజర్లు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

గుర్ల: విద్యార్థులకు మొదటి గురువు అంగన్వాడీ కార్యకర్తలే అని జిల్లా సమగ్రా శిక్ష ఆడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ రామారావు అన్నారు. బుధవారం ఆయన గుర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న అంగన్వాడీ కార్యకర్తల జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. ఈ శిక్షణా తరగతులను అంగన్వాడీ కార్యకర్తలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు భాను ప్రకాష్, శ్రీనివాసరావు, రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

బొండపల్లి: రాష్ట్ర వ్యాప్తం గా 1344 ఉన్నత పాఠశాలలను జ్ఞాన జ్యోతి శిక్షణా కేంద్రాలుగా ప్రభుత్వం ఎంపిక చేసిందని గంట్యాడ ఐసిడియస్



గుర్ల: మాట్లాడుతున్న జిల్లా సమగ్ర శిక్ష అడిషినల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్

సిడిపిఒ ఉమాభారతి అన్నారు. బుధవారం బొండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండవ రోజు జ్ఞాన జ్యోతి శిక్షణా కేంద్రంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ సమగ్ర శిక్ష అభియాన్ ఆంధ్రప్రదేశ్ 120రోజుల అంగన్వాడీ కార్యకర్తల సర్టిఫికెట్ కోర్స్ శిక్షణ కి సంబంధించి మార్గ దర్శకాలను విడుదల చేసిందన్నారు. నూతన విద్యా విధానాన్ని అమలు పరిచేందుకు పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు ఇలాంటి శిక్షణ దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు శోభారాణి, అల్లు వెంకటరమణ, పాఠశాల హెచ్ఎం బండి ఉమామహేశ్వరరావు, సూపర్వైజర్లు జానకి, ప్రమీల దేవి పాల్గొన్నారు

డెంకాడ: జ్ఞాన జ్యోతి 120 రోజుల సర్టిఫికెట్ కోర్సులో భాగంగా మండలంలోని 84 మంది అంగన్వాడీ కార్యకర్తలకు 6 రోజుల శిక్షణా కార్యక్రమాన్ని జిల్లా ఉప విద్యాశాఖాధికారి కె.వి.రమణ, సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు సిఎంఒ ఆదినారాయణ, ఎ.ఎంఒ ప్రసాద్, ఐ.ఇ. కోఆర్డినేటర్ సూర్యా రావు సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా డిప్యూటీ డిఇఒ మాట్లాడుతూ పిల్లల సమగ్రాభివృద్ధి బాల్యదశ నుండే జరగాలన్నారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్స్‌గా రవి, రాంబాబు,సూర్యారావు, శ్రీనివాసరావు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు సత్యవతి, శైలజ వ్యవహరించారు.

వేపాడ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ కార్యకర్తలకు జ్యోతి శిక్షణా కార్యక్రమం రెండో రోజు కొనసాగింది. ఎంఇఒ పి బాలభాస్కరరావు, ఐసిడిసి సూపర్వైజర్ భాగ్యవతి, కామేశ్వరి, ఉపాధ్యాయులు శ్రీవల్లి, సిఆర్‌పిలు, అంగనవాడిలు పాల్గొన్నారు.

భోగాపురం: జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని అంగన్వాడీ టీచర్లు ఉపయోగించుకోవాలని సమగ్ర శిక్ష అకాడమిక్ మోనటరింగ్ అధికారి బి.ప్రసాద్ రావు అన్నారు. పాఠశాల విద్యాశాఖ, ఎస్ఆర్‌టి, మహిళ అభివృద్ధి శిశుసంక్షేమ శాఖ, సముగ్రశిక్ష ఈ శాఖలు ఉమ్మడిగా శిక్షణను ఇస్తున్నాయని ఆయన అన్నారు. అంగన్వాడి కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేయడానికి ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష సిఎంఒ వి.ఆదినారాయణ, సమన్వయకర్త సూర్యారావు, మండల విద్యాశాఖ అధికారులు ఎం రమణమూర్తి, బి.చంద్రమౌళి, శిక్షణ శిబిరం ఇంచార్జ్ శ్రీనివాసరావు, రిసోర్స్ పర్సన్‌లు శ్రీనివాస్ బెహరా, కిషోర్, ఆనంద్ శాంతి లత, నాగమణి తదితరులు పాల్గొన్నారు.